క్లుప్తంగా

రుణాలు సకాలంలో చెల్లించాలి

కుంటాల: మహిళలు తీసుకున్న బ్యాంకు రుణాలను సకాలంలో చెల్లించేలా చూడాలని ఏపీఎం అశోక్ అన్నారు. మంగళవారం కుంటాల మండల సమైక్య భవనంలో మండల సమైక్య సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రుణాలతో స్వయంఉపాధి పొంది ఆర్థిక ప్రగతి సాధించాలన్నారు. మారిన రిజిస్ట్రేషన్ ప్రక్రియపై సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల సమైక్య అధ్యక్షురాలు బ్యాగరి లక్ష్మి, సీసీ పెంటన్న, యూసుఫ్, కవిత, వీవోఏలు, తదితరులు పాల్గొన్నారు.

బాల్యమిత్రుడికి ఆర్థిక అండ



నగదు అందిస్తున్న పూర్వవిద్యార్థులు

నర్సాపూర్(జి): మండలకేంద్రానికి చెందిన నెమలికొండ సంతోష్‌కు ఇటీవల రోడ్డు ప్రమాదం జరుగగా ఎడమ కాలును తొలగించారు. ఈ విషయం తెలిసి అతడితో జెడ్పీహెచ్ఎస్ 2004–05లో పదోతరగతి చదివిన విద్యార్థులు రూ.64,200 నగదు, సంతోష్ మిత్రుడు ధనే నవీన్ అనే సాఫ్ట్‌వేర్ తాను పని చేసే డెలాయిట్ సంస్థలోని సహోద్యోగులు, వాసవి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఎంసీఏ 2010–13 బ్యాచ్ మిత్రుల సాయంతో మరో రూ.53,300 నగదు సేకరించాడు. నర్సాపూర్(జి) మండల వాట్సాప్ గ్రూప్ ద్వారా రూ.3500 కలిపి మొత్తం రూ.1 లక్ష 21వేలు నగదును మంగళవారం బాధితుడికి అందించి దాతృత్వం చాటుకున్నారు. భవిష్యత్తులో అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా ప్రభాకర్



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

కడెం: మండల నూతన తహసీల్దార్‌గా రొడ్డ ప్రభాకర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన సుజాత ఖానాపూర్‌కు బదిలీపై వెళ్లగా.. కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తించే ప్రభాకర్‌ను ఇక్కడకు వచ్చారు. నూతన తహసీల్దార్‌ను సిబ్బంది సన్మానించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

ఖానాపూర్: పట్టణానికి చెందిన గాయిత్రి బ్రహ్మణ సంఘం నాయకులు నిమ్మగడ్డ రవీందర్‌శర్మ స్మారకార్థం ఆ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మూడు జిల్లాల క్రికెట్ టోర్నీ విజేతలకు మంగళవారం ఖానాపూర్‌లో బహుమతులు ప్రదానం చేశారు. ఈ టోర్నీ లో మొదటి బహుమతి సాధించిన జగిత్యాల జట్టుకు రూ.5వేలు, షీల్డు, రెండవ బహుమతి సాధించిన నిజామాబాద్ జట్టుకు రూ. మూడు వేలు, షీల్డులను అందజేశారు. డాక్టర్ కిరణ్‌కుమార్, శివ, రాజశేఖర్, వెంకటేశ్, సుమిత్, సందీప్‌శర్మ, రాజశేఖర్‌శర్మ, అభిషేక్‌శర్మ, రాఘవశర్మ తదితరులున్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి

లోకేశ్వరం: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని హెచ్‌ఎం రాజేశ్వర్ అన్నారు. మంగళవారం మండలంలోని రాజూర గ్రామ ప్రాథమిక పాఠశాలలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. ముత్తగౌడ్, వీడీసీ అధ్యక్షుడు ప్రవీణ్, నాయకులు సరస్వతి, గంగాధర్, రవీందర్ ఉన్నారు.

అనాథలకు సాయం



సాయం అందిస్తున్న కిరణ్ కొమ్రెవార్

ముధోల్: మండలంలోని అష్టా గ్రామంలో ఇటీవల తల్లిని కొడుకు చంపిన ఘటనలో అనాథలుగా మారిన పిల్లలను మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించారు.ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ జిల్లా సమన్వయ కర్త కిరణ్ కొమ్రెవార్ వారికి రూ.10వేలను ఆర్థిక సాయంగా అందించారు. బాసర మండల కన్వీనర్ కోర్వ శ్యామ్ మాట్లాడుతూ ఈ విషయాన్ని కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి పార్టీ తరఫున పిల్లలకు అండగా ఉంటామని పేర్కొన్నారు.

పరీక్షప్యాడ్లు పంపిణీ

కుంటాల: విద్యార్థులు ఇష్టంగా చదివి మంచి మార్కులు సాధించాలని మోహన్‌రావు పటేల్ ప్రజా ట్రస్ట్ చైర్మన్ బోస్లే మోహన్‌రావు పటేల్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కల్లూరు కేజీబీవీ, ఉన్నత పాఠశాల, వాసవి కళాశాలలోని పదో తరగతి విద్యార్థులకు పరీక్షప్యాడ్లు పంపిణీ చేశారు. లక్ష్మణ్‌పటేల్, బబ్లూ శ్రీనివాస్, ప్రిన్సిపాళ్లు సువర్ణ, రాజేశ్వర్, సాయిలు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాయిపల్లకి శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



అభిషేకం చేస్తున్న భక్తులు



మార్మోగిన సాయి నామస్మరణ

ఖానాపూర్: పట్టణంలోని శ్రీవీరాంజనేయ శివ సాయి సమాజ్ జంగల్ హనుమాన్ సాయిబాబా ఆలయ 28వ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం సాయి పల్లకిసేవ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం బాబా ఆలయం నుంచి పురవీధుల గుండా పల్లకిసేవ ఉత్తర వాహిని గౌతమి గోదావరి నది తీరం వరకు సాగింది. మహిళలు దారి పొడవునా పల్లకిసేవకు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. ఓ భక్తుడు సాయి బాబా వేషధారణలో ఆకట్టుకున్నాడు. భక్తుల గీతాలపనలు, యువకుల నృత్యాలు, మహిళల కోలాటం మధ్య శోభాయాత్ర వైభవంగా సాగింది. అనంతరం గోదావరి తీరంలో సాయిబాబా ఉత్సవమూర్తులకు అర్చకులు రామోజుల రామ కృష్ణశర్మ, శశిధర్‌శర్మ అభిషేకాలు, మంగళస్నానాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎల్లమ్మ ఆలయం వద్ద అన్నదానం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అంకం రాజేందర్, ప్రదీప్, భక్తులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు..

ఖానాపూర్‌లోని ఇంద్రనగర్ కాలనీలో గంగపుత్ర సంఘ భవనాన్ని వచ్చేనెల 3న ప్రారంభించనున్నారు. మంగళవారం గంగపుత్ర సంఘం నాయకులు శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. వేదపండితులు చక్రపాణి వాసు దేవాచార్యులు భవన ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రం ఆవిష్కరించారు. గంగపుత్ర సంఘం అధ్యక్షుడు పరిమి సురేశ్, ప్రధాన కార్యదర్శి మర్రి రమేశ్, సభ్యులు ఉన్నారు.

మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసు



అవగాహన కల్పిస్తున్న ఎస్సై మహమ్మద్ గౌస్

భైంసాటౌన్: మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసు నమోదు చేస్తామని పట్టణ ఎస్సై మహమ్మద్ గౌస్ అన్నారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని వేదం పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు వివరించారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ వెంట ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుంటాల: జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా మంగళవారం కుంటాల ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఎస్సై సీహెచ్.భాస్కరాచారి మాట్లాడుతూ అతివేగం, మద్యం తాగి వాహనాలు నడపడం ద్వారానే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మురళి, పంచాయతీ కార్యదర్శి రాజబాపు, సిబ్బంది పాల్గొన్నారు.

నృత్య ప్రదర్శన బృందానికి అభినందన



విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నిర్మల్‌ఖిల్లా: గణతంత్ర వేడుకల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రత్యేక గిరిజన బంజారా నృత్య ప్రదర్శన చేసిన ఈద్గాం గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థినులను కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి జాదవ్ అంబాజీ ప్రత్యేకంగా అభినందించారు. జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందించారు. మంగళవారం పాఠశాల ఆవరణలో విద్యార్థినుల బృందాన్ని ఏసీఎంవో శివాజీ, ప్రధానోపాధ్యాయుడు తుకారం, ఉపాధ్యాయుడు గజ్జారం తదితరులు అభినందించారు.

పోషకాహారంపై అవగాహన కల్పించండి



కార్యక్రమంలో పాల్గొన్న ఆశావర్కర్లు

నిర్మల్‌టౌన్: పిల్లలు, గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకునేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఐజీడీ జిల్లా కోఆర్డినేటర్ హుస్సేన్.. ఆశవర్కర్లకు సూచించారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవనంలో నిర్మల్ నియోజకవర్గంలోని ఆశవర్కర్లకు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ డెవలప్‌మెంట్ అండ్ ఆశీర్వాద్ స్మార్ట్ ఢిల్లీ ఆధ్వర్యంలో మంగళవారం రెండో రోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారికి అయోడిన్, పోషకాహార పదార్థాలు, ఆకుకూరలు, పండ్ల గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ సౌమ్య, సాయమ్మ, శివ తదితరులు పాల్గొన్నారు.

టోల్ కార్మికులను కొనసాగించాలి



రామ్‌కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సిబ్బంది

సోన్: గంజాల్ టోల్ ప్లాజా కార్మికులను యథావిధిగా విధుల్లో కొనసాగించాలని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రామ్ కిషన్‌రెడ్డి అన్నారు. టోల్ ప్లాజా సిబ్బంది చేపట్టిన సమ్మె మంగళవారం నాలుగో రోజుకు చేరింది. ఈసందర్భంగా వారి సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ 44వ జాతీయ రహదారిపై నిర్మించిన గంజాల్ టోల్‌ప్లాజాలో 15 ఏళ్లుగా 74 మంది కార్మికులు చాలీచాలని వేతనాలతో పని చేస్తున్నారని పేర్కొన్నారు. ఒక్క కార్మికుడిని తొలగిస్తే ఊరుకునేది లేదని.. అవసరమైతే జాతీయ రహదారిని దిగ్బంధం చేస్తామని కొత్త యాజమాన్యాన్ని హెచ్చరించారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి రూ.50 లక్షల ప్రమాద బీమా, ఈపీఎఫ్, ఈఎస్ఐలను పాత విధానంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఇస్తున్న వేతనంపై 20 శాతం పెంచి ఇవ్వాలని కోరారు. ఈసమస్యను కేసీఆర్, కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. మాజీ జెడ్పీటీసీ జీవన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు సుభాశ్‌రావు, జీవన్‌రావు, మహేశ్‌రెడ్డి, నడిపి రాజేశ్వర్, ఓం ప్రకాశ్, బసవరాజ్, మసూద్‌ఖాన్, నాయకులు, టోల్ సిబ్బంది పాల్గొన్నారు.

‘ఎమ్మెల్యేపై దుష్ప్రచారం సరికాదు’



ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

ఖానాపూర్: పట్టణంలో అబుల్ కలాం ఆజాద్ విగ్రహ ఏర్పాటు విషయమై మున్సిపల్ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును కలిసిన బీఆర్ఎస్ మైనార్టీ నాయకులతో మాట్లాడిన తీరును కొందరు దుష్ప్రచారం చేయడం సరికాదని కాంగ్రెస్ మైనార్టీ నాయకులు అన్నారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్‌కు చెందిన ఓ మైనార్టీ నాయకుడు ఎమ్మెల్యేకు ఫోన్ చేసి రెచ్చగొట్టేలా మాట్లాడాడని అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కలిసిన వారితో బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకుడి తీరు గురించి ఎమ్మెల్యే మాట్లాడితే.. కొందరు కావాలని ఎమ్మెల్యే మాటలు వక్రీకరించి అప్రతిష్టపాలు చేసేందుకు యత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యేకు ఫోన్ చేసి దురుసుగా మాట్లాడిన వారితో పాటు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్సై రాహుల్ గైక్వాడ్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు కరీం, యూసుఫ్‌ఖాన్, జహీర్ అహ్మద్, ఇసాక్, షబ్బీర్‌పాషా, తదితరులున్నారు.

ఆకట్టుకున్న కళాజాత

కుంటాల: మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో మంగళవారం కళాకారులు ప్రభుత్వ పథకాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత గంజాయి, డ్రగ్స్, మద్యం సేవించడం, మైనర్లు వాహనాలివ్వడం ద్వారా ఎదురయ్యే సమస్యలను ఆటపాటల ద్వారా వివరించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మురళి, పంచాయతీ కార్యదర్శి రాజబాపు, కళాకారులు లక్ష్మణ్, సుదర్శన్, నాగరాజు జితేందర్, తస్లీమా సుల్తానా, రఘునాథ్, మాధవి, సుధాకర్‌స్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కలకు నీరందించాలి

లోకేశ్వరం: నర్సరీలో పెంచుతున్న మొక్కలకు రోజు నీరందించాలని ఎంపీడీవో వెంకటరమేశ్ అన్నారు. మంగళవారం మండలంలోని ధర్మోర, పంచగుడి, అర్లి–గొడిసెరా, రాయపూర్‌కాండ్లీ తదితర గ్రామాల్లోని నర్సరీ మొక్కలను ఎంపీడీవో పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ కూలీలు పనికివచ్చి పిచ్చిమొక్కలను తొలగించాలని సూచించారు. ఆయన వెంట ఏపీవో జగన్నాథ్, ఎఫ్‌ఏ సాయన్న ఉన్నారు.

నిధుల మంజూరుపై హర్షం

తానూరు: ఏళ్లుగా గుంతల రోడ్లతో ఇబ్బంది పడుతున్న ప్రజల కళ సహకారం అవుతోందని బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం తానూరు ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తానూరు నుంచి కోలూరు మీదుగా మొగ్లి సరిహద్దు వరకు ఉన్న బీటీరోడ్డు దెబ్బతినడంతో కోలూరు, కోలురు తండా, మసల్గా, మసల్గాతండా, మొగ్లితోపాటు మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే రామారావ్ పటేల్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి రూ.5.90 లక్షలు మంజూరు చేశారని హర్షం వ్యక్తం చేశారు. కోలూరులో సబ్‌స్టేషన్ నిర్మించి తొమ్మిది గ్రామాలకు విద్యుత్ సమస్య పరిష్కరించాలని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు శివాజీ పటేల్, బాలాజీ, ఎల్లప్ప, మాధవ్‌రావ్, ఆయా గ్రామాల కార్యకర్తలు ఉన్నారు.

సన్మానం

కుంటాల:మండలంలోని లింబా (కె) గ్రామానికి చెందిన ఆమెడ రాధ, భోజన్న దంపతుల కూతురు హరిచందన మిషన్ భగీరథలో ఏఈగా ఉద్యోగం సాధించింది. దీంతో మంగళవారం ఉద్యోగ, ఉపాధ్యాయ సంక్షేమ సంఘం సభ్యులు ఆమెను సన్మానించారు. అధ్యక్షుడు ఏనుగు బాజరెడ్డి, ప్రధాన కార్యదర్శి, ఎస్.దత్తురాం, కోశాధికారి వినాయక్‌రెడ్డి, సభ్యులు కాంతారావు, సాహెబ్‌రావు, విఠల్, మల్లేశ్ సాయినాథ్, అన్వేశ్ తదితరులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దస్తురాబాద్: రాష్ట్ర ప్రభుత్వం నాలుగు ప్రజాసంక్షేమ పథకాలను అమలు చేస్తున్నందుకు మంగళవారం కాంగ్రెస్ శ్రేణులు దస్తురాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దుర్గం మల్లేశ్, కాంగ్రెస్ నాయకులు చుంచు వెంకన్న, గోపాల్, పులర్యానాయక్, స్వామి, అంజన్న, నాగరాజు, గోపి, లచ్చన్న, నరేశ్, శేఖర్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కడెం: మండలకేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట మంగళవారం ఎస్సై ఎం.కృష్ణ సాగర్‌రెడ్డి, ఎంఈవో షేక్ హుస్సేన్ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌నాయక్, క్రాంతికుమార్, మునీశ్వర్ తదితరులున్నారు.

నా భర్త జాడ చెప్పరూ..

- నిర్మల్ ప్రెస్‌క్లబ్‌లో గోడు వెల్లబోసుకున్న మహిళ
- నవంబర్ 18న ఇంట్లోంచి వెళ్లిన సంతోష్
- రెండు నెలలుగా వెతుకుతున్న కుటుంబసభ్యులు



ఫోన్‌లో తన భర్త ఫొటో చూపుతున్న రమాదేవి

నిర్మల్‌టౌన్: బయటకు పోతున్నానని చెప్పి ఇంట్లోంచి వెళ్లిన భర్త రాక కోసం ఓ ఇల్లాలు, పిల్లలు రెండు నెలలకు పైగా ఎదురుచూస్తున్నారు. మంగళవారం నిర్మల్ ప్రెస్‌క్లబ్‌లో ఆమె కుటుంబ సభ్యులతో కలిసి వివరాలు వెల్లడించారు. నిర్మల్‌లోని గాంధీనగర్ కాలనీలో గంధం సంతోష్-రమాదేవి నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కూతుర్లు, ఓ కుమారుడు ఉన్నారు. సంతోష్ బస్టాండ్ సమీపంలో ఫ్యాన్సీ దుకాణం నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గతేడాది నవంబర్ 18న షాప్‌నకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన సంతోష్ తిరిగి రాలేదు. నవంబర్ 23న పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. అతడి జాడ కోసం బంధుమిత్రుల ఇళ్లల్లో, బస్టాండ్ ఏరియాల్లో పోస్టర్ అతికించి వెతుకుతున్నా తెలియరాలేదు. రమాదేవి మాట్లాడుతూ తన భర్త జాడ ఎవరికైనా తెలిస్తే నిర్మల్ పట్టణ పోలీసులకు సమాచారం అందించాలని వేడుకున్నారు. తన పిల్లలు తండ్రి కోసం తల్లడిల్లుతున్నారని కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది.

ప్రమాదకర ప్రయాణం..!



కంకర రోడ్డుపై వెళ్తున్న ద్విచక్రవాహనదారుడు



క్యూరింగ్ లేక రోడ్డుపై లేస్తున్న దుమ్ము, ధూళి

- ఇష్టారీతిన 161బీబీ రహదారి పనులు
- పట్టించుకోని అధికారులు

భైంసాటౌన్: బోధన్ నుంచి భైంసా వరకు నిర్మిస్తున్న 161 బీబీ రహదారి పనులు ఇష్టారాజ్యంగా చేపడుతున్నారు. డివిజన్‌లో పలు చోట్ల పూర్తి చేస్తూ.. మరికొన్ని చోట్ల నెలల తరబడి అసంపూర్తిగా వదిలేస్తున్నారు. భైంసా మండలంలోని దేగాంలో సాయిబాబా ఆలయం నుంచి భైంసా వైపు వంతెన మీదుగా దాదాపు కిలోమీటర్ మేర పెద్ద కంకర (గిట్టి) వేసి రోడ్డు నిర్మించకుండా వదిలేశారు. అలాగే ముధోల్ మండలంలోని తరోడ గ్రామంలోనూ ఇదే దుస్థితి నెలకొంది. దీంతో వాహనదారులకు ప్రమాదకరంగా మారుతోంది. ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు కంకర రోడ్డుపై వెళ్తూ కింద పడుతున్నారు. కొందరు గాయాలపాలైన సంఘటనలూ ఉన్నాయి. రోడ్డుపై సరైన క్యూరింగ్ లేక వాహనాలు వెళ్లిన సందర్భాల్లో దుమ్ము, ధూళి లేచి గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని.. ఇప్పటికైనా రోడ్డు పనులు పర్యవేక్షణ చేయాలని కోరుతున్నారు.

పరిశుభ్రత పాటిస్తే రోగాలు దూరం



అవగాహన కల్పిస్తున్న హెల్త్ కౌన్సిలర్ లావణ్య

సోన్: రోగాల బారిన పడకుండా ప్రతి విద్యార్థి పరిశుభ్రత పాటించాలని హెల్త్ కౌన్సిలర్ డి.లావణ్య, ఎంఈవో పరమేశ్వర్ అన్నారు. మంగళవారం ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ కిశోర్ స్వస్థ్య (ఆర్‌కెఎస్‌కె) కార్యక్రమంలో భాగంగా మండలంలోని పాక్‌పట్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎం.చంద్రశేఖర్ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘కేంద్ర మంత్రి క్షమాపణలు చెప్పాలి’



ఆందోళన చేపడుతున్న నాయకులు

సారంగపూర్: ప్రజా యుద్ధనౌక గద్దర్‌పై కేంద్రమంత్రి బండి సంజయ్ మాట్లాడిన మాటలను వెంటనే వెనక్కి తీసుకొని ఆయనకు క్షమాపణ చెప్పాలని బహుజన సంఘాల నాయకులు మంగళవారం మండలకేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా బహుజన సంఘం నాయకుడు కొంతం మురళీధర్, అంబేద్కర్ యువజన సంఘం నాయకుడు పిల్లి నాగయ్య మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలోనూ తన ఆటపాటల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేసిన మహనీయుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో మారుతి, దేవిశంకర్, ముత్యం, ఈశ్వర్, సుమన్, సాయికుమార్, శంకర్, లక్ష్మీనారాయణ గౌడ్, రవి, దీపక్, గంగాధర్ తదితరులు ఉన్నారు.

మిలటరీ స్కూల్‌కు కుంటాల విద్యార్థి



ప్రజ్ఞయ్‌ను అభినందిస్తున్న ఎస్సై భాస్కరాచారి

కుంటాల: మండలకేంద్రంలోని సృజన విద్యానిలయం పాఠశాల విద్యార్థి పి.ప్రజ్ఞయ్ మిలటరీ స్కూల్‌లో ప్రవేశం పొందినట్లు ప్రిన్సిపాల్ కొత్త కాపు గంగన్న తెలిపారు. దేశంలో ఉన్న 5 రాష్ట్రీయ మిలటరీ పాఠశాలల్లో ఆరోతరగతిలో ప్రవేశం కోసం గత డిసెంబర్ 8న ప్రవేశపరీక్ష నిర్వహించగా ఫలితాలు సోమవారం రాత్రి విడుదలయ్యాయి. ఇందులో పి.ప్రజ్ఞయ్ ప్రతిభ కనబర్చి అర్హత సాధించాడు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే రాష్ట్రీయ మిలటరీ పాఠశాలకు ఎంపికవడం ఇదే మొదటిసారి. మంగళవారం ప్రజ్ఞయ్‌ని ఎస్సై భాస్కరాచారి, ప్రిన్సిపాల్ గంగన్న, ఉపాధ్యాయులు సన్మానించి అభినందించారు.

విద్యార్థులు ఇంటి వద్ద చదివేలా చూడాలి



ఎల్విలో మాట్లాడుతున్న ఎంఈవో నరేందర్

తానూరు: వార్షిక పరీక్షలు సమీపిస్తున్నదున పదోతరగతి విద్యార్థులు ఇళ్ల వద్ద చదివేలా చూడాలని ఎంఈవో నరేందర్ సూచించారు. మంగళవారం మండలంలోని ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థుల ఇళ్లకు వెళ్లిన ఎంఈవో వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. అనంతరం హంగిర్గా, హిప్నెల్లి గ్రామాల్లో పర్యటించారు. పరీక్షల వేళ వారికి ఎలాంటి పనులు చెప్పవద్దని సూచించారు. ఉపాధ్యాయులు శంకర్, భూమన్నయాదవ్ తదితరులు ఉన్నారు.

పరామర్శ

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్, అబ్దుల్లాపూర్ గ్రామాల్లో పలువురు మృతి చెందగా బాధిత కుటుంబాలను మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు కిరణ్ కొమ్రెవార్ తదితరులు పరామర్శించారు.

జయంతి

కుంటాల: కుంటాల శాంతినికేతన్ పాఠశాలలో మంగళవారం స్వాతంత్ర సమర యోధుడు లాలా లజపతి రాయ్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి నివాళు లర్పించి దేశానికి చేసిన త్యాగాలను వివరించారు. ప్రిన్సిపాల్ సంతోష్, డైరెక్టర్ ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.